# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త






## వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో
# ఏసీబీ దాడులు

### - రికార్డులు స్వాధీనం



వెంకటగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. టోల్ ఫ్రీ నెంబరు 14400 వచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి జిల్లా ఏసీబీ ఏఎస్పీ దేవప్రసాద్ బృందం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్, అకౌంట్స్ విభాగాల్లోని రికార్డులను పరిశీలించారు. కమిషనర్ వెంకటరామయ్యను వెంకటగిరి ఏఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ జనార్ధన్‌నాయుడు విచారించారు. 5 మంది సీఐలు, సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యాలయంలో ఇతరులను ఎవరినీ వాళ్లని లేకుండా ఏసీబీ సిబ్బంది ఆపేశారు. పలు రికార్డులను సీజ్ చేసి తీసుకెళ్లారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకున్నామని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కుటుంబంతో కలసి సోమవారం ఉదయం వెంకన్నను దర్శించుకున్నారు.



### అవినీతి ప్రభుత్వం అంతమే
# 'దేశం' పంతం

### చిత్తూరులో నారా లోకేష్ యువగళం పాదయాత్ర



చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రాష్ట్రంలోని అవినీతి ప్రభుత్వం అంతమే తెలుగుదేశం పార్టీ పంతమని జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 11వ రోజులో భాగంగా సోమవారం జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చిత్తూరు నగరంలో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. తవణంపల్లి మండలం నుండి ఆదివారం రాత్రి మంగసముద్రం చేరుకొని అక్కడే బస చేసిన నారా లోకేష్ సోమవారం ఉదయం మంగసముద్రం నుండి తన పాదయాత్రను ప్రారంభించారు. చిత్తూరు నగరంలో పాదయాత్ర చేపట్టిన నారా లోకేష్ ఎక్కడ సమావేశాలు పెట్టకుండా ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. మంగసముద్రం నుండి ప్రారంభమైన నారా లోకేష్ పాదయాత్ర బిడి కాలనీ, కోర్టు సర్కిల్, గాంధీ సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గా సర్కిల్, గిరింపేట, ఎంఎస్ఆర్ సర్కిల్. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు పాదయాత్ర సాగింది. ఈ పాదయాత్రలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర కార్యదర్శులు సందీప్, వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, మాజీ మేయర్ కఠారి అనురాధ, జిల్లా యువత నాయకుడు వసంత్‌కుమార్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మాజీ కార్పొరేటర్ సిఎం విజయ, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

### చిత్తూరు 'దేశం' నాయకులపై లోకేష్ సీరియస్!

నారా లోకేష్ చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులపై సీరియస్ అయినట్లు సమాచారం. చిత్తూరు నగర పరిధిలో జరిగే యువగళం పాదయాత్రలో నారా లోకేష్ సోమ, మంగళవారాలు పాల్గొననున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు మంగసముద్రం నుండి ప్రారంభమైన నారా లోకేష్ యువగళం పాదయాత్ర బిడి కాలనీ, సంతపేట, కోర్టు సర్కిల్, గాంధీ సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గా సర్కిల్, గిరింపేట, ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సాగింది. కుప్పం, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో యువగళం పాదయాత్రకు హాజరైన స్థాయిలో పాదయాత్ర ప్రారంభరోజు చిత్తూరులో పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కాకపోవడంపై నారా లోకేష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. చిత్తూరు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైతం నారా లోకేష్ పాదయాత్రకు పెద్దగా ప్రజలు హాజరు కాకపోవడంపై స్థానిక నేతలపై ఆరోపణలకు సిద్ధం అయ్యారు. నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయడానికి చిత్తూరు నగర పార్టీ నాయకులు పక్కా ప్రణాళిక రచించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పార్టీ నాయకులే పేర్కొంటున్నారు. నారా లోకేష్ మంగళవారం సాయంత్రం 3 గంటల వరకు చిత్తూరు పార్టీ కార్యాలయంలోనే మకాం వేసి ఆపై చిత్తూరు రూరల్ మండలంలో పాదయాత్రం చేపట్టనున్నారు. చిత్తూరు రూరల్ మండల పరిధిలో మంగళవారం జరిగే యువగళం పాదయాత్రను పూర్తి స్థాయిలలో విజయవంతం చేయడానికి ఇప్పటికే చిత్తూరు దేశం నాయకులు ప్రణాళికలు రచించినట్లు సమాచారం.

### ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్ - ఇద్దరు మహిళలకు గాయాలు

రేణిగుంట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై రేణిగుంట మండలం గురవరాజుపల్లి వద్ద సోమవారం సాయంత్రం ట్రాక్టర్‌ను కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడగా రోడ్డుకిరువైపులా వేలాది వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసుల కథనం మేరకు... రేణిగుంట వైపు వస్తున్న ట్రాక్టర్‌ను శ్రీకాళహస్తికి వెళుతున్న కంటైనర్ గురవరాజుపల్లి వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో కూర్చుని ఉన్న ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు. ఈ ప్రమాదం వల్ల రోడ్డుకిరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. స్పందించిన అర్బన్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ ఈశ్వరయ్యను తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పంపి రోడ్డుకి అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# మందుల దందా!

### పుట్టగొడుగుల్లా ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపులు



·గూడూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

వైద్యో నారాయణో హరి.. అనేది నానుడి. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరం వచ్చినా చిన్న చిన్న జబ్బులు చేసినా స్థానిక ప్రైవేట్ వైద్యులే చికిత్స చేసి తక్కువ ఖర్చుతో ప్రాణాలను కాపాడేవారు. అందుకే వారిని ప్రజలు దేవుడితో సమానంగా భావించే వారు. కానీ రాను రాను ఆ పరిస్థితి మారిపోతోంది. పల్లెలు, మారుమూల గ్రామాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని కొన్ని వీధులే లక్ష్యంగా చేసుకొని మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ మాఫియాలాగా మారిపోతోంది. తిరుపతి జిల్లాలోని గూడూరులో ప్రైవేట్ ఆసుపత్రుల మాఫియా జోరు పెరిగిపోతోంది. ఏటా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎంతో ఆశగా రోగాలు నయం చేసుకునేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు వెళుతున్న రోగులకు జేబులు చిల్లులు పడుతున్నాయి. ఒకవైపు టెస్టులు, మరోవైపు మందుల పేరుతో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. రూ.150, రూ.300తో నయమవుతుందని వస్తున్న పేదలు సైతం వేలకు వేలు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్న చిన్న రోగాలకు సైతం విపరీతంగా టెస్టులు రాయడం, స్కానింగ్, ఎక్స్‌రేలు అవసరం ఉన్నా లేకున్నా మందులు రాసి వారి ఆసుపత్రులలోనే ఉన్న మెడికల్ షాపుల ద్వారా రోగులు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రుల వైపు వెళ్లాలంటే రోగులు భయపడే పరిస్థితి నెలకొంది. గూడూరులో 20 నుంచి 30 చిన్నా పెద్దా ప్రైవేటు ఆసుపత్రులు ఉండటం విశేషం. అందులో జనరల్ ఆసుపత్రులు, కంటి ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డెంటల్ క్లినిక్‌లు, ఎముకలు, నరాల ఆసుపత్రులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఆసుపత్రుల సంఖ్య విపరీతంగా పెరుగుతూనే ఉంది. వీటికి తోడు ఆర్ఎంపి డాక్టర్ల సర్వీసులు ఎక్కడ పడితే అక్కడ కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కనీస విద్యార్హత లేని వారు కూడా ఆసుపత్రులు నిర్వహిస్తున్నారంటే ప్రైవేట్ ఆసుపత్రుల మాఫియా ఏ మేరకు నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. గతంలో వైద్యులు చేతి నాడి చూసి ఏ రోగం ఉంది, ఏ మందులు వాడాలో చెప్పేవారు. ప్రస్తుతం రోగి తనకున్న జబ్బు తెలియజేసినప్పటికీ పదుల సంఖ్యలో టెస్టులు నిర్వహిస్తుండటం విశేషం. ల్యాబ్‌లలో అర్హత లేని వారితో టెస్టులు చేఉయించడం, దానినే ప్రామాణికంగా తతీసుకొని వైద్యం చేయడం పరిపాటిగా మారింది. వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రైవేట్ ఆసుపత్రుల్లో గుడ్డి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతతో చెలగాటమాడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ప్రైవేట్ ఆసుపత్రులలో, క్లినిక్‌లలో రోగులకు అవసరమైన కనీస అవసరాలను కూడా ఏర్పాటు చేయకుండా వైద్య వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రోగులను, బంధువులను భయపెడుతూ వారి నుంచి వచ్చిన కాడికి లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారని ప్రైవేట్ వైద్యులు, ఆసుపత్రులపై విమర్శలు ఉన్నాయి. కనీసం మూడు నెలలకు ఒకసారి వైద్యఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేఉపడితే అక్రమంగా జరుగుతున్న వైద్య వ్యాపారానికి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ మరింత నిఘా పెట్టి మెడికల్ మాఫియాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రూ.6వేల కోట్లతో విద్యాశాఖలో మౌలిక సదుపాయాలు

### నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించటమే లక్ష్యంగా...: ఎంఎల్ఏ





సైన్సు ప్రదర్శనలోభాగంగా మాట్లాడుతున్న ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి, .రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

రాష్ట్రంలో నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించుటకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టుదలగా పని చేస్తున్నారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. సోమవారం ఇక్కడి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తిరుపతి జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రతి సంవత్సరం ఆన్స్పైర్ మరియు నేషనల్ చిల్డ్రన్స్ కాంగ్రెస్‌తో పాటు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ఆనవాయితిగా జరుగుతూ వస్తున్నాయని కరోనా తరువాత మొదటి ప్రదర్శనలు పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేయటం తనకు ఎంతో అనందంగా ఉందన్నారు. ఈ ప్రదర్శనలు ప్రారంభించిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత పదవులు సాధ్యమౌతుందన్నారు. విద్యతోనే ఏదైనా సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం భావించి ఆర్థికంగా ఎన్ని కష్ట,నష్టాలున్నా విద్యకు నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల విద్యతోపాటు బైజూస్ ట్యాబ్‌లు అందించి శ్రీమంతులకు అందుబాటులో ఉండే నాణ్యమైన ఆంగ్ల విద్యను అందిస్తూ నిరుపేద విద్యార్థుల గుండెల్లో ముఖ్యమంత్రి గూడు కట్టుకున్నారని శాసనసభ్యుడు అన్నారు. విద్యార్థులు పసి తనం నుంచే విన్నూత్నమైన ఆలోచనలతో ఉపాధ్యాయుల సలహాలతో నూతన సాంకేతిక పరిజ్ఞానం తగ్గట్లుగా ప్రయోగాలు చేసి భవిష్యత్తులో సైన్‌టిస్టులు కావాలని ఆశీర్వదించారు. తనకు ఆంగ్లం తెలియకపోవటం వెలితి ఇప్పుడు తెలుస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్క పేద విద్యార్థి పట్టుదలతో ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పేద విద్యార్థుల భవిష్యత్తుపైనే ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఏ పథకాలు అమలు చేస్తూనే ఫలితాలు ఇవ్వవని ఆచరించగా ఆచరించగా మహోన్నత ఫలితాలు వస్తాయని వివరించారు.

#### ప్రతి నిరుపేద విద్యార్థి ఓ శాస్త్రవేత్త కావాలి: కలెక్టర్

ఈ విజ్ఞాన సదస్సులో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి నిరుపేద విద్యార్థి ఓ శాస్త్రవేత్త కావాలని అన్నారు. ప్రభుత్వం విద్యా,వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని వాటిలో అనేక పథకాలను నిబద్ధతో అమలుచేస్తుందని వివరించారు. ఎంతో మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి రుచికరమైన ఆహారం అందిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో ఏమౌతారని అడిగితే సామాన్యంగా ఐఏయస్, ఐపియస్, ఇంజనీర్ టీచర్ అని చెబుతారని అయితే సైంటిస్టులు వివిధ రంగాలలో విన్నూత్నమైన వాటిని భవిష్యత్తు ప్రయోజనాలకు అందించే గొప్పవారన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వచ్చే ఏడాది మరింత సృజనాత్మక పరిశోధనలను ప్రదర్శించేలా ఉండాలన్నారు. గత డిసెంబర్ 14,15 తేదుల్లో మండల స్థాయిలో అన్ని పాఠశాలల నుంచి ఎగ్జిబిట్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. 5 సబ్ థీమ్స్ నుంచి ఎంపిక చేసిన వాటిని 34 మండలాల నుంచి 170 ఎగ్జిబిట్స్ నేడు ఉండటం తనకు ఎ ంతో సంతోషం కల్గిస్తుందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, డిఇఒ శేఖర్, ఆర్డిఒ రామారావు డిఇఒ శేఖర్, డివైఇఒ రఘురామయ్య, ఎంఈవో భువనేశ్వరి, హెచ్‌ఎం రాజేశ్వరి, ఎస్‌ఎంసి అధ్యక్షులు ఆర్కాడుశంకర్, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు నేడులో..నాకింత..నీకింత..!

### నాణ్యతకు తిలోదకాలు..!

గంగవరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ఉన్నతాశయంతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులు సౌకర్యం కోసం విద్యను అభ్యసించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలకు నాడు నేడు కింద మరమత్తులు, అదనపు గదుల నిర్మాణం కోసం పనులను చేపట్టింది. మొదటి విడతలో కొన్ని పాఠశాలల్లో మరమత్తులు, అదనపు గదులు నిర్మించారు. రెండో విడతలో భాగంగా మరి కొన్ని పాఠశాలలకు నాడు నేడు నిధులను విడుదల చేసింది. కొన్ని పాఠశాలలలో నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. కొన్ని చోట్ల అసలు నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాలను ఇటీవల రెండవ విడతలో నాడు నేడు పనులకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో మౌలిక వసతుల కోసం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మొదటి విడతగా దాదాపు రూ.4 లక్షలు విడుదల చేసింది. ఈ క్రమంలోనే పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఓ గది సెంట్రింగ్ స్టేజ్‌లోనే కూలిపోవడమే ఇందుకు నిదర్శనం. అయితే ప్రభుత్వం పనులు చేసిన తరువాత బిల్లులు మంజూరు చేసే బాధ్యతను పాఠశాల ప్రధానోపాద్యాయులకు అప్పగించింది. ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంటే కొందరు ఉపాధ్యాయులు తమ చేతి వాటం చూపిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు కారుస్తున్నారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇలాంటి ఉపాధ్యాయులు ఉన్నంత వరకు ప్రభుత్వం అనుకున్న కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఇంగ్లీషులో విద్యాభ్యాసం లక్ష్యం ఎక్కడ నెరవేరుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



పాఠశాలలో నిర్మించిన గది నిర్మాణంలోనే మోల్డింగ్ జారిపోయిన దృశ్యం

# స్పందనకు 191 అర్జీలు



ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఈ వారం ప్రజల నుండి సమస్యలపై 191 అర్జీలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించిన కలెక్టర్ హరినారాయణన్ సత్వరం పరిశీలించి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూకు సంబంధించి 133, డిఆర్‌డిఎ 40, హౌసింగ్ 5, డిఎంహెచ్‌ఓ 2, మున్సిపాల్టీ 1, డ్వామా 2, ఉపాధి కల్పన, వికలాంగుల శాఖ, పంచాయతీరాజ్, స్త్రీ, శిశుసంక్షేమంలకు సంబంధించి ఒకొక్క సమస్య, ఇతర శాఖలకు సంబంధించి 3 సమస్యలు అధికారులకు అందాయి.

### స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించండి



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 112 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరుచూ సమీక్షస్తున్నారని తెలిపారు. జిల్లా అధికారులు అర్జీల మీద సత్వరం చర్యలు గైకొని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జె.సి. డి.కె. బాలాజీ, డిఆర్వో శ్రీనివాసరావు, ఎస్‌డిసిలు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తజన సందోహం

# శివయ్య సన్నిధిలో జనమే..జనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. ఆదివారం వ్యాస పౌర్ణమి పక్కనే సోమవారం కావటంతో కావటంతో పూజలు చేయించుకోవటానికి భక్తులు కిట కిట లాడారు. దక్షిణ కైలాసంలో వెలసిన వాయుటింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు ఓ వైపు శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాటు మరో వైపు ఉత్సవాలు ఇంకోవైపు భక్తుల సదుపాయాల్ని పర్యవేక్షించారు. అలాగే తన సిబ్బందిని సమాయత్త పరచారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కదలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. ఆదివారం ఉదయం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోని ఎటు చూసినా జనం జనం. సోమవారాల్లో సుమారు 30 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.

# గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

## - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**గుడిపాల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని దీనిని దృష్టిలో వుంచుకొని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామాల్లో ప్రతి సౌకర్యం కల్పించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని గట్టాలమిట్ట గ్రామ పంచాయతీలో సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న



సంక్షేమ పథకాల వివరాలను తెలిపి పథకాలకు అర్హులై వుండి ఎవరికైనా పథకాలు మంజూరు కాకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకొంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, మండల వైకాపా కన్వీనర్ జనార్ధన్, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ ఉపేంద్ర, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు రజనీకాంత్, జైకోడి, గణపతి, కో-అప్షన్ సభ్యుడు కారుమేఘం, ఎంపిటీసీ మొగిలిరెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, కళైఅరసి, శింబు, సాయి, హరి, మండల స్థాయి అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యార్థులచే గాయత్రీ మంత్ర పఠనం

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**



పట్టణంలోని పలు పాఠశాలల్లో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆదేశాల మేరకు విద్యార్థులచే గాయత్రిమంత్ర పఠనం, వాటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు తెలియజేసినట్లు సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు, కన్వీనర్ మధుసూదనం, శేషనారాయణలు తెలిపారు. సంతపేటలోని దేవిబాలమందిర్, గిరింపేట దుర్గాపబ్లిక్‌స్కూల్, ఓవర్ బ్రిడ్జి సమీపంలోని ఆర్‌కె విద్యాలయ నందు బాలవికాస్ గురువులచే సుమారు 630మంది విద్యార్థులకు తండులార్చన గావించి గాయత్రిపఠనం గావించారు. ఈ కార్యక్రమాలలో బాలవికాస్ సమన్వయకర్తలు వసంత, శంకర్, శివప్రకాష్, గురువులు అనురాధ, రుక్మిణి, యామిని, హేమలతలు పాల్గొన్నారు.

## శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ, మహాకుంభాబిషేకం

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**
గంగాధరనెల్లూరు మండలం, కొట్రకోన గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షిసమేత శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ, అష్టబంధన, మహాకుంభాబిషేకంను ఈనెల 12వ తేది ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామూర్తినాయుడు, యుగంధరాచ్చారిలు తెలిపారు. ఈ నెల 10వ తేది శుక్రవారం సాయంత్రం 5గంటలకు గణపతిపూజ. హోమం, గోపూజ, వాస్తుశాంతి, పూర్ణాహుతి, అలాగే 11వ తేది శనివారం ఉదయం 8గంటలకు నూతన బింబత్రికోలం, కెండవకాల యాగశాల, అష్టదశపూజ, నేత్రదర్శనం, 12వ తేది ఆదివారం ఉదయం 4.30గంటలకు యాగపూజ, హోమం, పూర్ణా హుతి, 7.45గంటలకు విమాన కుంభాబిషేకం, 8.15గంటలకు మూలస్థాన కుంభాబిషేకం, సాయంత్రం 6గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం, ఆలయ ప్రదక్షిణం, దీపారాధన, ప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు.

## తెలుగుదేశం మైనార్టీ విభాగం కేలండర్ ఆవిష్కరణ

**కుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం కేలండర్‌ను సోమవారం చిత్తూరులో కుప్పం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు జాకీర్ అహ్మద్ ఆవిష్కరించారు. యువనేత నారా లోకేష్ పాదయాత్ర కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ అధ్వర్యంలో సోమవారం మైనార్టీ నేతల సమావేశం జరిగింది. ఈసందర్భంగా కేలండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు ఉమ్మర్, ఇస్మాయిల్, ఖాసీం, ఉమర్, హారూన్, జావేద్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## హిందు ధర్మపరిరక్షణ సమితిచే ఉచిత దంతవైద్య శిబిరం

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



కుప్పం హిందు ధర్మపరిరక్షణ సమితి, శాంతి డెంటల్ క్లినిక్ అధ్వర్యంలో సోమవారం మండలంలోని చందం హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డా॥ సుదర్శన్, డా॥శాంతిప్రియలు విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, నరేష్, విజయ్, ధనరాజ్, సురేష్, శంకర్, రాజు, సత్య, మంజు, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## జి-20 ప్రాధాన్యత అంశాలపై మహిళలకు శిక్షణ

**కుప్పంరూరల్/శాంతిపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



మహిళా రైతులకు జి-20 ప్రాధాన్యత అంశాలపై కుప్పం, శాంతిపురంలలో చిత్తూరు డిఆర్‌సి ఎడిఎలు నాగపద్మిని, గోపాల్‌లు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు సేంద్రీయ, సుస్థిర వ్యవసాయం, చిరుధాన్యాల పోషక విలువలు, చిరుధాన్యాల సాగు తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒలు అమృతవల్లి, అప్పోజి, ఎఇఒ ఔరంగ్, ఆర్‌బికె సిబ్బంది గోపీనాథ్, నరసింహులు, మహిళలు పాల్గొన్నారు.

## పూరి గుడిసె దగ్ధం : వైసీపి నాయకుల ఆర్థిక సాయం

**గంగవరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :**
అర్ధరాత్రి ఓ పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు వివరాలి.. మండలంలోని రెంటకుంట్ల గ్రామానికి చెందిన చినపాపమ్మ పూరి గుడిసెలో నివాసం ఉంటుంది. ఆదివారం ఆర్ధరాత్రి చినపాపమ్మ నిద్రస్తుండగా గుడిసెకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. అగ్ని ప్రమాదంలో ఇటీవల డ్వాక్రా సంఘం ద్వారా తీసుకున్న అప్పు రూ.50తో సహ నిత్యవసర సరుకులు అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న స్థానిక వైసీపి నాయకులు బాలూ, మంజునాథరెడ్డి, రెడ్డెప్ప, బాబు, ఆనంద తదితరులు బాధితురాలికి రూ.5 వేలు ఆర్థిక సాయంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు.

## తుమ్మలవారిపల్లి దళితవాడకు స్మశాన స్థలం ఏర్పాటు

**గుడిపాల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**
మండలంలోని వసంతాపురం గ్రామ పంచాయతీ తుమ్మలవారిపల్లి, వసంతాపురం హరిజనవాడలకు స్మశాన వాటికల ఏర్పాటుకు స్థలాలను తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో చదును చేశారు. ఈ సందర్భంగా తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దళితవాడల ప్రజల కోసం ప్రత్యేకంగా స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఈ మేరకు స్థలాలను సర్వే చేసి స్మశానాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలా ఏర్పాటు చేసిన స్మశానాలు ఆక్రమణలకు గురి కాకుండా హద్దులను సైతం ఇప్పుడే నిర్ధారిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమాసాయి, విఆర్‌ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గాపురం దళితవాడ స్మశానంకు 50 సెంట్ల భూమి

**పాలసముద్రం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**
మండలంలోని వనదుర్గాపురం దళితవాడ ప్రజలకు స్మశాన వాటిక ఏర్పాటు కోసం తహసిల్దారు బాబు 50 సెంట్ల స్థలంను కేటాయించారు. ఈ మేరకు సోమవారం వనదుర్గాపురం సర్పంచ్ నరసింహరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, విఆర్‌ఓ తంగరాజులు స్థలంను శుభ్రం చేసి బోర్డును పెట్టారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుప్రసాద్, సర్వేయర్ హేమాద్రి, వాలంటీర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్ర విజయవంతంకు పిలుపు

**పాలసముద్రం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**
పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీ రంగంపేట క్రాస్ వద్ద ఈ నెల 9న జాతీయ తెలుగు దేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించే యువగళం పాదయాత్ర విజయవంతం చేయాలని మండల దేశం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో 8వ తేదీ యువగళం పాదయాత్ర ముగించుకొని నారా లోకేష్ జిడినెల్లూరు నియోజకవర్గంలో ప్రవేశిస్తారని, 9వ తేదీ సాయంత్రం పాలసముద్రం మండలం ఆముదాల రంగంపేట క్రాస్ చేరుకొని బహిరంగ సభలో ఆయన పాల్గొంటారన్నారు.

## రామకుప్పం తహశీల్దార్‌గా మురళి బాధ్యతలు

**రామకుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



రామకుప్పం మండల తహశీల్దార్‌గా మురళి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు కుప్పం తహశీల్దార్ సురేష్‌బాబు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించేవారు. తహశీల్దార్ మురళి గంగవరం నుంచి బదిలీపై రామకుప్పం వచ్చారు. మండలంలో భూసమస్యల పరిష్కారంకు రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికే గడప గడపకు

**- ఎమ్మెల్యే వెంకటేగౌడ**

**వి.కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. సోమవారం సుద ్దలకుప్పంలో ఆయన గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ దామోదర్ ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలు పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామన్నారు. ప్రజలు కూడా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదన్నారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి యువరాజ్, వైస్ ఎంపిపిలు లక్ష్మణ్‌రెడ్డి, తమీంఖాన్, జడ్పీ అడ్వైజర్ గౌస్, జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అమర్‌నాథ్, పిఎసిఎస్ అధ్యక్షుడు గోపిరెడ్డి, రెస్కో డైరెక్టర్ భూపతి యాదవ్, ఎంపిడిఒ బాలాజీ, ఎపిఒ అశోక్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంచే పెద్దఎత్తున అన్నదానం

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



కుప్పం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం సోమవారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా తన తల్లి వర్ధంతి సందర్భంగా సుమారు 500మందికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, అన్నక్యాంటీన్ నిర్వాహకుడు బిఎంకె రవిచంద్ర, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మణి, నడిమూరు సర్పంచ్ జెకె సంతోష్, ఐటిడిపి అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి, ఎంపిల హామీలన్నీ నెరవేర్చుతున్నాం

## -ఛైర్మన్ అలీంబాషా

**పుంగనూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :**
పట్టణంలో ఇటీవల పర్యటించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిధున్‌రెడ్డిలు తమ పర్యటనలలో ఇచ్చిన అభివృద్ధి పనులకు కారా ్యచరణ కోసం నిధులు కేటాయించడం జరిగిందని, వారి సూచనల మేరకు వాటిని అమలులో తీసుకువస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా అన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని పుంగమ్మ టాంక్‌బండ్‌పై కోటిరూపాయలకుపైగా నిధులతో వాకర్స్‌ట్రాక్ నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి గత మున్సిపల్ ఎన్నికలకు ముందే మంత్రి పలుసూచనలు జారీచేశారన్నారు.



అందులో భాగంగా పట్టణంలో ట్రాఫిక్‌రదీ ్దను తొలగించడానికి కోట్లాదిరూపాయల వ్యయంతో జాతీయరహదారి వెంబడి బైపాస్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువచ్చామన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద క్లాక్ టవర్‌ను కూడా త్వరలో ఏర్పాటుచేస్తామన్నారు. ఇపుడు పట్టణంలోని పుంగమ్మ టాంక్‌బండ్‌పై వాకర్స్‌ట్రాక్ ఏర్పాటుతో పాటూ అందులో ఉద్యానవనం, దీపాలతో ఆధునీకరణ వంటిపనులను ప్రారంభిస్తునామన్నారు. కమీషనర్ నర్సింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈపనులకు గానూ తొలివిడతగా ఎంపి నిధులకింద రూ.50లక్షలు విడుదలయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అమ్ము, కౌన్సిలర్లు త్యాగరాజు, గంగులమ్మ, కాంతమ్మ, భారతీ, కాంట్రాక్టర్ చెంగారెడ్డి, వైకాపా నాయకులు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పెన్నక్క చెరువు కబ్జాపై రైతుల ఫిర్యాదు

**కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో పెన్నక్క చెరువు ఆక్రమణలకు గురవుతుందని ఆ గ్రామ ఆయకట్టు రైతులు సోమవారం తహశీల్దార్ పద్మావతికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొంత మంది చెరువును ఇంజన్లు పెట్టి నీళ్ల తోలి చెరువును ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వందలాది మంది రైతులు ఈ చెరువు ద్వారా సాగునీటితో పంటలు పండించుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ మేరకు ఆక్రమణదారులపై విచారించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పద్మావతి పేర్కొన్నారు.

## గృహమిత్ర పథకం విజేత కోట వాసి

**కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
ఇటీవల దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా నెల్లూరు హెచ్‌పిసిఎల్ గ్యాస్ డీలర్ ఎఆర్‌బి ప్రొడక్ట్స్ మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎల్‌పిజి వినియోగదారులకు పలు కార్యక్రమాలు చేపట్టారు. అందులో గ్యాస్ వినియోగించే పైపులు, ఒక సిలిండర్ ఉన్న వారు అదనపు సిలిండర్ కొనడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇలా మూడు నెలల్లోపు వస్తువులు కొంటున్నప్పుడు వారికి గృహ మిత్ర పథకంలో పాల్గొనేటట్లు ఒక బహుమతి కూపన్ కూడా ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా నెల్లూరు జిల్లాలో మొదటి బహుమతి కోట మండలంలోని డీఆర్ హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులైన పండ్లూరు కామాక్షమ్మకు దక్కింది. అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ మనోజ్‌కుమార్ సమక్షంలో నెల్లూరులోని హెచ్‌పిసిఎల్ రిటైల్ ఆఫీసులో ఎలక్ట్రికల్ బైక్ ఇవ్వడం జరిగింది. ఇక్కడ బహుమతులు పొందడమే కాకుండా గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## బటన్ నొక్కుడు ఇంకెప్పుడు

**కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
నవరత్నాల అమలులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు మూడో విడత ఆసరా అమలు చేసేందుకు డిఆర్‌డిఎ అధికారులు చేపట్టిన కసరత్తు పూర్తయింది. రుణమాఫీ సాయం జమ చేసేందుకు బయోమెట్రిక్ నమోదు తప్పనిసరని నిబంధన పెట్టారు. ఈ మేరకు డిసెంబర్ నెలాఖరుకు గ్రామీణ ప్రాంతాల్లోని ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేశారు. మొదటి విడతగా అర్హులైన సంఘాల మహిళల ఖాతాలకు 2020 సెప్టెంబర్‌లో, రెండో విడత 2021 అక్టోబర్‌లో రుణమాఫీ నగదు జమ చేశారు. ఇక మూడో విడత ఈ ఏడాది జనవరిలో జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంక్రాంతి పండగను పురస్కరించుకొని గత నెల మొదటి రెండు వారాల్లో జమ చేస్తారని అంతా భావించినప్పటికీ ఫిబ్రవరి వచ్చినా ఆ ఊసే లేదు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిధులను జమ చేస్తారని సంఘాల మహిళలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

## పెరియవట్టులో గడప గడపకు

**తడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



తడ మండలం పెరియవట్టు పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తొలి రోజు పెరియవట్టు ప్రధాన గ్రామంతో పాటు కొన్ని కాలనీలలో ఆయన పర్యటించారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి కొళవి రఘు, స్థానిక సర్పంచ్ చిన్నప్పన్, ఎంపిటిసి రమేష్, పలువురు వైసీపీ నాయకులు, ఎంపిడిఓ ఎవి మురళీకృష్ణ, తహశీల్దార్ ఎస్.రామయ్య, గృహ నిర్మాణ, విద్యుత్ శాఖల ఎఇలు సత్యనారాయణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

## రామాపురం కుప్పం వద్ద పాఠశాల భవనాల అభివృద్ధి

**తడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
తడ మండలం రామాపురం కుప్పం పాఠశాల వద్ద ప్యానాసోనిక్ కంపెనీ నిధులతో సోమవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఇక్కడ మరుగుదొడ్లు, ప్రహరీగోడ, తరగతి గదుల మరమ్మతులు, పిల్లలకు డెస్కులు, ఆట వస్తువులు వంటివి సమకూర్చుతున్నారు. సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేసి ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు నాగవేణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు, సరళమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సిఆర్‌పి గోపి, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# జగనన్న రాజ్యంలో సంక్షేమ పరిపాలన

## - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**తడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పరిపాలన విజయవంతంగా జరుగుతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన తడ వద్ద ఒక హోటల్‌లో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోడెద్దుల్లా పరుగులు



తీస్తున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపైనే ఉందని చెప్పారు. కొత్తగా నియమితులైన గృహ సారధులతో వాలంటీర్లు, కన్వీనర్లు కూడా సమన్వయంగా పనిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కొళవి రఘురెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, జడ్పిటిసి ఇందుమతి, మండల ఉపాధ్యక్షుడు కుప్పంపాటి వెంకటేష్, సిహెచ్ రమేష్, మండల సచివాలయ కన్వీనర్ ఆర్‌కె సుందరరెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## కంపెనీ ఉద్యోగి అదృశ్యం

**తడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



తడలో నివాసం ఉన్న పొన్నపాటి శ్రీనివాసరెడ్డి (43) అనే ఒక కంపెనీ ఉద్యోగి అదృశ్యంపై సోమవారం తడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా నరసారావుపేటకు చెందిన ముద్దుల నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అతని అక్క భర్త పొన్నపాటి శ్రీనివాసరెడ్డి గత 12 సంవత్సరాల నుంచి తమిళనాడులోని గుమ్మిడిపూండి వద్ద ఉన్న ఒక కంపెనీలో ఆపరేషనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తడలోని సూళ్లూరు వీధిలో నివాసం ఉంటున్నాడని, గత నెల 25న శ్రీనివాసరెడ్డి అన్న చనిపోతే భార్య పిల్లలతో అక్కడికి వెళ్లి, భార్య పిల్లలను నరసారావుపేటలోనే వదిలి వారంరోజుల క్రితం తడకు వచ్చినట్లు చెప్పారు. అయితే ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాసరెడ్డి తన భార్యకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పినప్పటికీ ఇంకా రాలేదని, ఫోన్ స్విచాఫ్‌లో ఉందని బాధితుడు చెప్పాడు. అతని ఆచూకీ ఇప్పటిదాకా తెలియని కారణంగా తడ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం ఆర్డీఓకి వినతి

**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని సిఐటియు అనుబంధ సంస్థ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సోమవారం ఆర్డీఓకి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ యూనియన్ గౌరవాధ్యక్షుడు సాంబశివయ్య ఆధ్వర్యాన యూనియన్ నాయకులు ఆర్డీఓను కలిసి తమ సమస్యలు వివరించారు. ఇఎస్ఐ వైద్య సౌకర్యం కోసం కార్మికులు కొన్ని నెలలుగా సభ్యత్వ రుసుము చెల్లిస్తున్నారని, కానీ ప్రభుత్వం వైద్య సౌకర్యం, ప్రసూతి ఖర్చులు, లీవులు అందుబాటులో లేకుండా చేసి కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. సర్వీసు అందుబాటులో లేని కారణంగా ఇంతవరకు వసూలు చేసిన రుసుము వాపసు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా మున్సిపల్ కార్మికుల కార్యదర్శి గోపి, సీపీఎం మండల కమిటీ కార్యదర్శి పద్మనాభయ్య, రామయ్య, పళణి, చెంగయ్య, రమణయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
దివంగత తిరుపతి పార్లమెంటు సభ్యుడు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎన్.వెంకటస్వామి 11వ వర్ధంతి సందర్భంగా సోమవారం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వెంకటస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ తరపున సభ్యులు కామిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, బూరగ మనోహర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రామదేవత పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**నాయుడుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



నాయుడుపేట పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు చేపట్టారు. రెండు నెలల 11 రోజులకు గాను రెండు లక్షలా 39 వేల 699 రూపాయలు హుండీ ద్వారా ఆదాయంగా లభించినట్లు దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి పాయసం శాంతారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య, కమిటీ సభ్యులు శ్రీకాంత్, పసల హరిబాబు, దేవతా కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ చేసిన సిఐ

**నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
నాయుడుపేట పట్టణంలోని గడియారం సెంటర్‌లో అర్బన్ సిఐ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ కృష్ణయ్య పోలీసు సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందరత్భంగా సిఐ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేసమయంలోలైసెన్స్‌తోపాటువాహనపత్రాలుతప్పనిసరిగాఉంచుకోవాలన్నారు. అతివేగంగా నడపడం, హెల్మెట్ లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్ చేసే వారి వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## గూడూరులో స్పందన కార్యక్రమం

**· గూడూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
గూడూరులోని తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులతో ఆర్డీఓ కిరణ్‌కుమార్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యరకమంలో సమస్యలపై ప్రజలు అందజేసిన ప్రతి అర్జీని పరిశీలించడంతో పాటు ఆ అర్జీ అందజేసిన వారికి రసీదులు ఇచ్చారు. ప్రతి సమస్యకు ఒక వారంరోజుల్లోగా పరిష్కారం చూపాలని మండలస్థాయి, డివిజన్ స్థాయి అధికారులకు ఆర్డీవో సూచించారు. ఇకపై ఎలాంటి అర్జీ తీసుకొని ప్రజలు మండలం నుంచి రావాల్సిన అవసరం లేదని, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆర్డీవో ఆదేశించారు.

## జక్కావెంకయ్య శ్రామిక నగర్‌లో సమస్యలు పరిష్కరించండి

**· గూడూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని కామ్రేడ్ జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో సుమారు 25 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న సుమారు 52 నిరుపేద కుటుంబాలకు సంబంధించిన వారు నానా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గూడూరు సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, తిరుపతి జిల్లా ఆటోసంఘం నాయకులు బివి రమణయ్య, కెవిపిఎస్ నాయకులు ఆడపాల ప్రసాద్, కె.సురేష్, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ ఐఎస్‌టికి ఎన్‌బిఎ గుర్తింపు

**కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**
కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ) గుర్తింపు టైర్-1 స్థాయిలో లభించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సివిల్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. ఈ గుర్తింపు 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2024-25 మూడేళ్ల పాటు ఉంటుందని తెలిపారు. గత సంవత్సరం నవంబర్ నెల 18, 19, 20 తేదీల్లో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి అనేక రంగాల్లో నిష్ణాతులైన తొమ్మిది మంది ప్రొఫెసర్లు ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించి, ఆ మేరకు నివేదికను ఢిల్లీలోని ఎన్‌బిఎ ప్రధాన కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. వివిధ దశలలో మూల్యాంకనం పూర్తయిన తర్వాత ప్రధాన కార్యాలయం నుంచి గుర్తింపు



లభించినట్లు సమాచారం అందిందని ఆయన తెలిపారు. ఇదివరకే ఎ-గ్రేడ్‌తో న్యాక్ గుర్తింపు ఉన్నట్లు చెప్పారు. గుర్తింపును సాధించడం పట్ల కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తమ కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# సీఆర్ఎస్ క్రీడా మైదానంలో ఆటల పోటీలు ప్రారంభం



రేణిగుంట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:
రేణిగుంట(తిరుపతి) సీఆర్ఎస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వెస్ట్ కాలనీ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నీతో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలకు సీఆర్ఎస్ చీఫ్ వర్క్‌షాపు మేనేజర్ దేవ సహాయం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు స్పోర్ట్స్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, స్పోర్ట్స్ సెక్రటరీ గుణశేఖర్, పలువురు క్రీడాకారులు పలికారు. బెలూన్లు ఎగురవేసి టోర్నీని ప్రారంభించారు. సీబీఆర్‌ఏ టీము, ఎలక్ట్రికల్(ఏ) జట్లతో ఆట ప్రారంభమైంది. క్రీడాకారులు పరిచయం చేసుకుని ఇరుజట్ల కెప్టెన్ల సమక్షంలో టాస్ వేసి పోటీ ప్రారంభించారు. సీడబ్ల్యుఎం దేవ సహాయం మాట్లాడుతూ పని ఒత్తిడికి లోనయ్యే కార్మికులకు క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేహ దారుద్యానికి పెంపొందిస్తాయన్నారు. కార్మికులు క్రీడల్లో పాల్గొని స్నేహభావంతో మెలగాలన్నారు. స్పోర్ట్స్ ఆఫీసర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ఈ క్రీడలు దాదాపు రెండు నెలల పాటు జరుగుతాయన్నారు. ఇందులో బాగంగానే క్రికెట్ వాలీబాల్, షటిల్, చెస్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, పురుషులకు, మహిళలకు నిర్వహిస్తామన్నారు. మొదటి క్రికెట్ మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ జట్టు, సీబీఆర్ జట్టు తలబడ్డాయి. బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రికల్ జట్టు 16 ఓవర్లలో 101 స్కోరు చేసింది. సీబీఆర్ జట్టు 15 ఓవర్లలోనే 102 స్కోర్‌తో గెలుపొందింది. స్పోర్ట్స్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, సీఆర్ఎస్ అధికారులు ముఖేష్ కుమార్, రామాంజనేయులు, అరుణ్‌కుమార్, ఉమాకాంత్, మురళీధరన్, సాయి, శ్రావణ్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ గుణశేఖర్, జాయింట్ సెక్రటరీ రాబర్ట్, కార్మిక సంఘాల నాయకులు సదాశివరెడ్డి తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సింగపూర్ సంస్థతో ఎస్వీయూ ఒప్పందం

విసి ఆచార్య రాజారెడ్డి



తిరుపతి (క్రీడ), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త
ఎస్వీయూ ఉపకులపతి కార్యాలయంలో సింగపూర్ కేంద్రంగా నడిచే ప్లానెట్ వైస్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో ఒప్పందం చేసుకున్నారు. ఈ అంశంపై విసి మాట్లాడుతూ కార్బన్ రహిత పర్యావరణ కోసం ప్రకృతి సురక్ష పేరుతో ప్రారంభమైన కార్యక్రమంలో ఎస్వీయూ భాగస్వామ్యం అవుతుందని, వ్యర్థాలు, నీరు, శక్తి వంటి వాటిని సమర్ధవంతంగా, వ్యర్థమై పోకుండా ఈ ఒప్పందంలో భాగంగా కొన్ని కార్యక్రమం చేపట్టే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ఇండియాలో కార్బన్ రహిత పర్యావరణాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తూ, సహజసిద్ధమైన వనరులైన నీరు, చెట్టు, గాలి వంటివి స్వచ్ఛంగా పెంపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ప్లానెట్ వైస్ కో పౌండర్ పి. రవితో ఒప్పందం పత్రం అందజేసారు. ఆచార్యవరదరాజన్, ఆచార్య దివాకర్ రెడ్డి, ఆచార్య రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో డ్రోన్ పిచికారి ద్వారా సాగు ఖర్చు ఆదాయం



పుత్తూరురూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:
పుత్తూరు మండలం తొరూరు గ్రామంలో వ్యవసాయంలో డ్రోన్‌లు ఉపయోగించి పురుగు మందుల పిచికారిపై అవగాహన కల్పించి ప్రదర్శన నిర్వహించినట్లు తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా. ఎస్.శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, న్యూ ఢిల్లీ వారు వ్యవసాయ డ్రోన్‌ల వినియోగాన్ని రైతులకు చేరవేయడానికి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంను ఎంపిక చేయడం జరిగిందని, ఈ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల్లో రైతు పొలాల్లో డ్రోన్ వినియోగించి ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సాంకేతికత గురించి ఆయన మాట్లాడుతూ డ్రోన్ వినియోగించి పిచికారికి ఎకరాకు 6 నుంచి 8 నిమిషాల సమయం పడుతుందని, కేవలం 10 లీటర్ల నీరు ఎకరాకు సరిపోవడంతో పాటు సాధారణ పద్ధతిలో వినియోగించే మందులో 75 నుంచి 80 శాతం మందు సరిపోతుందని తద్వారా నీరు, పురుగు మందు, కూలీల ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని, మామూలు పద్ధతి కన్నా ఈ పద్ధతిలో పురుగు మందు ప్రభావం బాగా ఉంటుందని రైతులు ఈ నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలో 10 ఎకరాల మామిడి, పొద్దు తిరుగుడు పొలాల్లో డ్రోన్ వినియోగించి పురుగు మందు పిచికారిపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు దివ్య, రాము కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకుడు మురళి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## తొట్టంబేడులో కుష్ఠువ్యాధి అవగాహనపై ర్యాలీ

తొట్టంబేడు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



కుష్ఠువ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తొట్టంబేడు ప్రాథమిక ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి తేజేశ్వరి అన్నారు. జాతీయ కుష్ఠువ్యాధి దినోత్సవ సందర్భంగా తొట్టంబేడు గ్రామంలో సర్పంచ్ సుబ్బయ్య(సుబ్రమణ్యం) ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తొట్టంబేడు హరిజనవాడలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాదికారిణి తేజేశ్వరి మాట్లాడుతూ జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంలో గాంధీ మహాత్ముని వర్ధంతి జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు. స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంపై కరపత్రాలను గ్రామ సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్జీవోలు, ఆశా కార్యకర్తలు అందరికీ ఇచ్చి నేడు మహాత్మాగాంధీ వర్ధంతి రోజు నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్ఠువ్యాధిలేని దేశం కోసం అందరు కృషిచేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు తల్లులకు గర్భవతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ సంపూర్ణ, సూపర్‌వైజర్లు భారతీ, కామరాజు, ఎఎన్ఎం వరలక్ష్మి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## కోట్ల విలువచేసేభూమిని కబ్జాచేస్తున్నారు



-తిరుపతి ఎస్పీకి టిడిపి ఫిర్యాదు

తిరుపతి, ఫిబ్రవరి 6ప్రభాతవార్త:
తిరుపతిలో సర్వేనెంబర్ 254/2,3,4,5, 255/1,256/1 భూమిని కబ్జా చేసేందుకు వైసిపినేతలు ప్రయత్నిస్తున్నారని టిడిపి నేతలు ఎస్పి పరమేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. 2004లో స్థలాన్ని కొన్నామని, స్థలాన్ని గుణశేఖర్‌నాయుడుకు లీజుకు ఇస్తే, లీజు దారులను, వైసిపి కార్పొరేటర్, నేతలు దళితులను అడ్డం పెట్టుకుని కబ్జాకు యత్నిస్తున్నారని టిడిపి నేతలు సుగుణమ్మ, బుల్లెట్‌రమణ, వట్టికుంట శంకరనారాయణ, మునిశేఖర్‌రాయల్ తదితరులు ఎస్‌పికి ఫిర్యాదుచేశారు.

## టిటిడి ఆడిట్ విభాగం డైరీ ఆవిష్కరణ

తిరుపతి, ఫిబ్రవరి6ప్రభాతవార్త:
టిటిడి ఆడిట్ విభాగం ముద్రించిన డైరీని ఇఒ ఏవి ధర్మారెడ్డి ఆవిష్కరించారు. ఆడిట్ అంశాలకు సంబంధించిన సమాచారంబావుందని ఆడిట్ విభాగం జాయింట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, ఆడిట్ అధికారులు రామ్మూర్తి, లక్ష్మీ, ప్రభావతి, ఎఎఓలు విశ్వనాధరాయలు, రఘురాం, రామారావును అభినందించారు.

## బిఎస్ఎన్ఎల్ ఫైబర్‌నెట్ వినియోగదారులకు ఐపిటివి సేవలు

తిరుపతి, ఫిబ్రవరి6ప్రభాతవార్త:



ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని బిఎస్ఎన్ఎల్ ఫైబర్‌నెట్ వినియోగదారులకు వాయిస్, ఇంటర్నెట్ సేవలతోబాటు ఐపిటివి సేవలుప్రారంభించినట్లు బిఎస్ఎన్ఎల్ తిరుపతి ప్రిన్సిపల్ జిఎం సి.అమరేంద్రరెడ్డి తెలిపారు. ప్రభుత్వ రంగసంస్థ బిఎస్ఎన్ఎల్, ఉల్కా టివిసౌజన్యంతో సోమవారం ఫైబర్‌నెట్ వినియోగదారులకు ఈ నూతన సేవలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ సదుపాయం వల్ల బిఎస్ఎన్ఎల్‌హైస్పీడ్ ఇంటర్‌నెట్‌తోబాటు కేబుల్ కనెక్షన్‌కుప్రత్యామ్నాయంగా ఐపిటివి సేవలుబిఎస్ఎన్ఎల్‌ద్వారా తక్కువ ధరకే పొందవచ్చన్నారు. ఎస్‌డి బేసిక్ 239 రూపాయలు, హెచ్‌డి బేసిక్ ప్యాక్ 279 రూపాయలతో లభిస్తాయన్నారు. ఫైబర్‌నెట్ సేవలు వినియోగదారులకు మరింత చేరువగా నెలకు 329 రూపాయలు అద్దెతో సరికొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టిందన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు 329 రూపాయలు ప్లాన్‌తో 20 ఎంబిపిఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ సదుపాయం 1000జిబి డాటాతో ఉచిత అపరిమిత వాయిస్‌కాల్స్ కూడా చేసుకునే సదుపాయం కల్పించారు. బిఎస్ఎన్ఎల్ భారత్ ఉద్యమి పథకంలో ఎంపిక చేసిన గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫైబర్‌నెట్ కనెక్షన్‌ను ఉచితంగా అందుకుని, 3వేల రూపాయలు రాయితీ రూపంలో ఉచితమన్నారు. పట్టణప్రజల కోసం 6నెలలులేక ఏడాదికాలం బిఎస్ఎన్ఎల్‌ఫైబర్ సేవలు599 కంటే ఎక్కువప్లాన్ ఒకసారి తీసుకుంటే2వేల రూపాయలు మోడెమ్ ఉచితంగా ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు డిజిఎంలు వెంకోబారావు, జయశంకర్, ఆదారావు, ఉల్కాటివి ప్రతినిధి మహేష్, సనత్ పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది స్పందనలో ప్రజలకు అందుబాటులో ఉండాలి

కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలకు అందుబాటులో వుండేందుకు సచివాలయ సిబ్బంది తమ తమ సచివాలయాల్లో సిద్ధంగా వుండాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణలు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అదికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ అనుపమ మాట్లాడుతూ ప్రతి సోమవారం తమ తమ సచివాలయల్లో అందరు సిబ్బంది ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని అదే విధంగా నగర పాలక సంస్థకు వచ్చే ఫిర్యాదులను సచివాలయ సిబ్బందికి అప్పటికప్పుడే తెలియజేయడం జరుగుతుందన్నారు. నరసింహ తీర్థం రోడ్ తుడా అపార్ట్‌మెంట్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా వున్న ఓపెన్ డ్రైన్ వాటం సరిగా లేనందున మురికి నీరు రోడ్డుపైకి వచ్చి నిలుస్తున్నదని, దీని వలన దుర్గంధం వస్తూ దోమలు పెరుగుతున్నాయనే పిర్యాదుపై స్పందిస్తూ తమ సిబ్బంది పరిశీలించి తగుచర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అన్నమయ్య మార్గ్ వెనుక వైపు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని, హతీరాంజీ కాలనీ రాధానారాయణ హాస్పిటల్ పక్కన కుక్కలు ఎక్కువగా వుండడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చంద్రశేఖర్ రెడ్డి కాలనీ వద్ద కాలువపై ఉన్న బ్రిడ్జి కృంగిపోతున్నదని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంటు సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్, గోమతి, దేవిక, శానిటరి సూపర్ వైజర్ చెంచెయ్య, సుమతి, అధికారులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ యాత్రతో వైసిపి బెంబేలు

తప్పుడు కేసులతో యాత్రను అడ్డుకోలేరు. ,టిడిపి మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి



చంద్రగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:
టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టి యువగళం పాదయాత్రకు ప్రజల నుండి లభిస్తున్న అపూర్వ ఆధరణతో వైసిపి బెంబేలెత్తుతున్నట్లు టిడిపి మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి దుయ్యబట్టారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గడచిన పది రోజులుగా నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. యువగళం పేరిట ఎవరో యాప్ రూపొందించి ప్రజలను మోసం చేస్తే అది టిడిపి కార్యకర్త చేసినట్లు చెప్పడం హాస్యాస్పదమన్నారు. సిబిఐ కేసులు నానాటికీ బిగుసుకుంటుండంతో దిక్కుతోచని స్థితిలో ప్రజల దృష్టిని మరల్చడానికే పసలేని ఆరోపణలు చేస్తున్నట్లు కొట్టిపడేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కూర్ ధనంజయ రెడ్డి, నాయకులు శానంబట్ల తులసి రెడ్డి, మండలనేని లోకేష్, హేమ రాయల్, రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల అసోయేషన్ మండల అధ్యక్షుడుగా కె.భరత్



చంద్రగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ మండల అధ్యక్షుడుగా మిట్టపాళ్యం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.భరత్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ నూతన కార్యవరా్గన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడుగా కె.భరత్, కార్యదర్శిగా టి.ప్రియాంక, ఉపాధ్యక్షుడుగా ఏ.ప్రసన్నకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రావణి, కోశాధికారి కౌషిక్, ఈసి సభ్యులుగా భరత్, వినీత్, త్రివేణి, ఎన్నికయ్యారు.

## బాధితులకు పోలీసులు అండగా నిలవండి..!

ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



రామచంద్రాపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:
బాధితులకు పోలీసులు అండగా నిలవాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మహిళా పోలీసులు విధి నిర్వహణపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో వున్న కేసులు సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రతి రోజూ విజువల్ పోలీసింగ్ చేస్తూ వాహనాలను తనిఖీ చేపట్టడంతో పాటు పెట్రోలింగ్ వాహనాలలో గ్రామాల్లో తిరుగుతూ నేరాలను నియంత్రించాలన్నారు. ప్రజలకు పోలీసుల పట్ల నమ్మకం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నరసప్ప, సిఐలు చంద్రశేఖర్ పిళ్ళై, ఓబులేష్, ఎస్ఐ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుడిపాడులో బొల్లినేని

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలో రాచగున్నేరి మాజీ సర్పంచ్ శ్రీకాళహస్తిలోని ప్రముఖ వ్యాపారి బొల్లినేని జగన్నాథం నాయుడు ఇండిపెండెంటుగా రాబోవు 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారంలో మునిగితేలుతున్నారు. ఈ నేపథ్యంలో బొల్లినేని జగన్నాథం నాయుడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వెళ్ళి అక్కడి నాయకుల మద్దతు కోరుతున్నారు. నియోజకవర్గంలో అందరికి సుపరిచయస్థుడైన బొల్లినేని జగన్నాథం నాయుడు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ నిరుపేదలను ఆదుకుంటూ తమ ప్రచారాన్ని సాగిస్తున్నారు.

### 8న హుండీల లెక్కింపు:

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు స్వామి అమ్మవార్లకు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈ నెల 8న లెక్కించనున్నట్లు ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు వివరించారు. ఉదయం 8గంటలకు గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా లెక్కింపు జరుగుతుందని నిర్ణయించిన ఉద్యోగులు డ్రెస్‌కోడ్‌తో హాజరు కావాలని కోరారు.

## ప్రజలకు అండగా జగనన్న ప్రభుత్వం..ఎంఎల్‌ఏ

తొట్టంబేడు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



ప్రజలకు అండగా ఎన్నడూ జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని ఎవ్వరు అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి జగన్న పథకాలు అందుతాయని ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తెలిపారు. గడపగడపకు కార్యక్రమంలో సోమవారం భాగంగా మండలంలోని కారాకొల్లు మరియు కారాకొల్లు హరిజనవాడ, దొంగలముదూరు, తుమ్మలగుంట, శ్రీకృష్ణాపురంలో ఆయన పర్యటించడంతో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ ప్రతి ఇంటింటికి వెళ్ళి ప్రజలు, వృద్ధులు, యువత సమస్యలను తెలుసుకుంటూ ముందుకుసాగారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా, లేదా అని తెలుసుకున్నారు. నిరుపేదలకు జగనన్న పథకాలు ప్రతి ఒక్కరికి అందాల్సిన అవసరం ఉందని అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి అందజేయాల్సిన అవసరం వాలంటీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నంవాసుదేవనాయుడు, చంద్రబాబునాయుడు, చెంచుకృష్ణమనాయుడు, మోహన్‌కిషోర్‌నాయుడు, సర్పంచ్‌లతమణి, వెంకటరామానాయుడు, ఎంపిటిసి శైలజ, చెంగయ్య, చిరంజీవి, వెంకటేశ్వర్లు, కిషోర్, ప్రవీణ్, వేణు, వినోద్, జయచంద్ర, మణి, గోవర్ధన్‌బాబు, శ్రీనివాసులు, మహేష్, చంద్రశేఖర్, మునిశేఖర్, రమణయ్యనాయుడు, రాజేంద్ర, రవి, సుబ్బారావు, రాజేష్, పాతిప్రకాష్, కార్తీక్, మాజీ ఎంపిపి చంద్రయ్యనాయుడు, పలువురు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## మహిళా సమస్యలపై నారాలోకేష్ సమావేశం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో భాగంగా సోమవారం చిత్తూరులో జరిగిన పాదయాత్రలో మహిళలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి వారి సాధకబాధలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు అందుతున్న పథకాలు, నేటి ప్రభుత్వంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి తెలుసుకోవడంతో పాటు నేడు ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తికి చెందిన తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష పలువురు మహిళలు పాల్గొన్నారు. అనంతరం మహిళలు లోకేష్‌ను ఘనంగా సత్కరించారు.

## మృతికి నివాళులర్పించిన కుమార్‌స్వామిరెడ్డి

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపాలిటీ 17వ వార్డుకి చెందిన మాజీ ఛైర్మన్ అంకయ్య సోదరి పెద్ద అంకమ్మ మృతి చెందారు. మృతికి మంత్రి రోజా సోదరులు వై.కుమారస్వామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు లేని ఓటు వారి కుటుంబానికి, వైసీపీ పార్టీకి తీరని నష్టమని వారి కుటుంబానికి మేము ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి, కో-ఆప్షన్ మెంబరు చీరాల, వైసీపీ నాయకులు జనార్ధన్ యాదవ్, దిలీప్ మొదలి, చక్రి, వెంకటముని, బాబు, రాంబాబు, పెద్ద అంకయ్య, మునస్వామి తదితరులు ఉన్నారు.

## లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న నగరి టీడీపీ నాయకులు

నగరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:



టీడీపీ జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చిత్తూరు నియోజకవర్గంలో సోమవారం నిర్వహిస్తున్న 11వ రోజు పాదయాత్రలో 11వ రోజు నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ నేను సైతం అంటూ పాల్గొన్నారు. ఆయనతో పాటు నగరి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిని అరికట్టవచ్చు - లక్ష్మీపతిరెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:



కుష్టు వ్యాధి పూర్వకాలం మాదిరి భయంకర వ్యాధి కాదని వ్యాధిని నివారించడానికి వైద్యం ఉందని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ గ్రామ పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఎంఎన్‌హెచ్‌వో యామిని మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, అంటు వ్యాధిగా ఎలా వ్యాపిస్తుంది, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. సర్పంచ్ మాట్లాడుతూ పురాతన కాలంలో మాదిరి కుష్టు భయంకరమైన వ్యాధి కాదన్నారు. వ్యాధిని నివారించడానికి అనేక అధునాతన వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా స్పర్శ లేని మచ్చలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సదస్సులో గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బంది, ఎంఎన్‌హెచ్‌వో యామిని, ఏఎన్ఎం రెడ్డెమ్మ, ఆశ వర్కర్ మోహిని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ డైరీ ఆవిష్కరణ

తిరుపతి క్రైం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా 2023 పోలీస్ డైరీని అనంతపురం డిఐజి రవి ప్రకాష్ తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో మొట్టమొదటి సారిగా ఎస్పి పరమేశ్వర రెడ్డి సహకారంతో పోలీస్ అధికారుల సంఘం డైరీని రూపొందించింది. సిబ్బందికి ఉపయోగపడే విధంగా సమాచారం సెలవులు భధ్రత ఆరోగ్య భధ్రత సర్వీసు రూల్స్ సిబ్బంది విధులు అధికారాలు ప్రవర్తన నియమావళి ఉద్యోగ విరమణ సమాచారంతో రూపొందించారని ప్రయోజనం ఉపయోగించుకోవాలని డిఐజి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విమల కుమారి, వెస్ట్ డిఎస్పి నర్సప్ప యూనివర్సిటీ సిఐ రవీంద్రనాథ్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శంకర్ రెడ్డి, ట్రెజరర్ కామరాజు, మీనాక్షి, బేబి కుమారి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

-పెరుమాళ్ళపల్లిలో గడప గడపకు కార్యక్రమంలో ఎంపిపి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి06 ప్రభాతవార్త:



రాష్ట్రంలోని ప్రతి ఇంటి సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం పెరుమాళ్ళపల్లిలో నిర్వహించారు. ముందుగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఎంపిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించి, పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ జోగి మోహనకుమార్, వైకాపా సీనియర్ నాయకులు కొత్తపాటి మునీశ్వరరెడ్డి, పెద్దమంగారి గుణశేఖర్‌రెడ్డిలు ఎంపిపి మోహిత్‌రెడ్డికి గజమాలవేసి, దుశ్శాలవతో ఘనంగా సత్కరించారు. గడప గడపకు వచ్చిన మోహిత్‌రెడ్డికి మహిళలు హారతుల ఇచ్చి స్వాగతం పలికారు. ఎంపిపి మోహిత్‌రెడ్డి మాట్లాడతూ రాజకీయ అరగ్రేటానికి అవకాశం కల్పించిన పెరుమాళ్ళపల్లి పంచాయతీ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీసారు.

పెరమాళ్ళపల్లి గ్రామ పంచాయతీలో రూ.5.75కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కర్మక్రియల కేంద్రం, ఆర్వో వాటర్ ప్లాంట్, ప్యామిలీ పార్కు తదితర పనులకు రూ.1.26 కోట్ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. రూ.20లక్షల నిధులతో నిర్మించనున్న కాల్వ పనులకు భూమిపూజ చేసారు. మరో రూ.1.50కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటనారాయణ, భాస్కర్, భాను, పెద్దమంగారి గౌతమి, లోకనాథం, చాట్ల రవి, రాజు, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కల్యాణ వెంకన్న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపులో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టిటిడి పిఆర్ఓ రవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సంప్రదాయానుసారం బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం రోజున ఆలయ శుద్ధి గావించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటల నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయశుద్ధి) కార్యక్రమంలో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని పరిశుద్ధ జలాలతో శుద్ధి గావించి నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ గావిస్తారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం అనుమతించనున్నారు.

## కన్నుల పండువగా శ్రీ కోదండరామస్వామి పేట ఉత్సవం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి పేట ఉత్సవం సోమవారం పండవుగా నిర్వహించారు. మాఘ పౌర్ణమి మరుసటిరోజు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులను తిరుపతి సమీపంలోని కూపుచంద్రపేట గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీ. ఉదయం 6గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు ఊరేగింపుగా బయలుదేరి, తిరుపతికి 8కిలోమీటర్ల దూరంలో గల కూపుచంద్రపేటకు చేరుకుంది. అక్కడ ఉదయం 10 నుండి 11:30 గంటల వరకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనే, పసుపు, చందనంతో స్వామి అమ్మవార్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. స్వామి ఊరేగింపులో టిటిడి హిందూ ధర్మ ప్రచారపరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో భజనలు, కోలాటాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆలయ సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆనందకుమార్ దీక్షతల, టెంపుల్ ఇన్స్పెక్టర్స్ కె.చలపతి, సురేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్తా

**- మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాదయాత్ర ప్రారంభం**



గూడూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : పాదయాత్ర ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల ఆశీస్సులు పొందుతానని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాదయాత్రకు సోమవారం నుంచి గూడూరు రెండో పట్టణం ఇందిరానగర్ నుంచి శ్రీకారంచుట్టారు. ఆయన పాదయాత్రకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, వెంకటగిరి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పరసా రత్నం, తానంకి నానాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందని, దోపిడీ విధానమే ప్రధాన అజెండాగా ఇప్పటి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గూడూరు తీరప్రాంతంలో విరివిగా లభించే అరుదైన సిలికాను స్వయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన బంధువులు దర్జాగా దోచుకుంటున్నారని ఆరోపించారు. సొంత మైన్‌లు కలిగిన హక్కుదారుకు టన్నుకు 200 రూపాయలు చెల్లించి, వీరు మాత్రం రూ.1500 అమ్ముకొని ప్రత్యక్ష దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పనితీరును ఎండగట్టడానికి పాశం సునీల్ కుమార్ పాదయాత్ర చేపట్టడం శుభపరిణామమని, రాబోయే రోజుల్లో సునీల్‌కు అంతా మంచి జరుగుతుందని, గూడూరు ప్రజలు ఆశీర్వదిస్తామని అన్నారు. ఈ పాదయాత్ర నిర్విరామంగా జరుగు తుందని, గూడూరు నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల సహకారంతో ముందుకు వెళ్తానని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన కనెక్టివిటీ రోడ్లు, సిసి రోడ్లు, కల్వర్టులు తప్ప కొత్తగా వైసీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. రాబోయే రోజుల్లో ఈ పాదయాత్రలో ప్రభుతత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని, ప్రజలకు అండగా నిలుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, నల్లబల్లి భాస్కర్‌రెడ్డి, పులికి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వరరాజు, మస్తాన్‌నాయుడు, రావూరి సురేంద్ర, ఇజ్రాయిల్, మన్నేపల్లి చంద్ర, సుధాకర్‌రాజు, నాగభూషణం, నాగేశ్వరరావు, చక్రవర్తి, కృష్ణ, కల్యాణ్, మట్టం శ్రావణి, పల్లె కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ ఆశీలు వసూళ్లలో అక్రమాలు...పట్టించుకోని కమిషనర్



పుత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీలో కూర గాయల మార్కెట్ ఆశీలు వసూళ్లలో కాంట్రాక్టర్ అక్రమాలకు పాల్ప డుతు న్నారని సమాచార హక్కుల వేదిక కన్వీనర్ కె.మురగారెడ్డి సోమవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమ ంలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆశీలు వసూలుకు గెజిట్‌లో వున్న షరతులు అమలు కావడం లేదని, గెజిట్‌లో పేర్కొన్న రేట్ల కంటే అధికంగా కాంట్రాక్టర్ చిరు వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చిరు వ్యాపారుల నుంచి ఒక రోజుకు 15 రూపాయలు వసూలు చేయాల్సి వుండగా 60 నుంచి 70 రూపాయల వరకూ వసూలు చేస్తున్నారని తెలిపారు. కరోనా అనంతరం వ్యాపారులు అప్పులు పాలైన నేపథ్యంలో అధిక మొత్తంలో ఆశీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై గత ఏడాది 30వ తేదీన తాను మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. దానిపై మూడు వారాలు గడిచినా మునిసిపల్ అధికారులు స్పందించలేదన్నారు. దాంతో జనవరి 23వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారని తెలిపారు, ఏడు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినా, పుత్తూరు మునిసిపల్ కమిషనర్ తనను పిలిచి విచారిం చలేదని తెలిపారు. ఏ మాత్రం విచారించకుండానే సమస్య పరిష్కాం ´మైపోయిందని విజయ వాడలో ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక ఇచ్చారని తెలిపారు. దాంతో విధిలేక సమస్య పరిష్కారం కోసం మళ్లీ స్పందన కార్యక్రమాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. కమిషనర్ తప్పుడు నివేదిక ఇవ్వడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అదే విధంగా చిరువ్యాపారుల నుంచి అధిక మొత్తంలో ఆశీలు వసూలును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## యువగళానికి పెరుగుతున్న జనాదరణ : భానుప్రకాష్



పుత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేష్ నిర్వహి స్తున్న యువగళం పాద యాత్రకు రోజురోజుకీ జనా దరణ పెరుగుతోందని టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం 11వ రోజున చిత్తూరు నియోజకవర్గంలో జరిగిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకేష్‌బాబు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. వైసిపి పాలనలో దగా పడ్డ ప్రజానీకం యువగళం పాదయాత్రలో లోకేష్‌బాబుతో కలిసి అడుగులు వేస్తున్నారని తెలిపారు. పాదయాత్రకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి అధికార వైసిపి నాయకులకు చెమటలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. పాదయాత్రలో చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, పుత్తూరు మునిసిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, నగరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పి.వెంకటేష్, పట్టణ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నవీన్, యువత అధ్యక్షుడు బి.ఎస్.హరి, చిత్తూరు పార్లమెంట్ టిఎన్‌టియుసి కార్యనిర్వాహక కార్యదర్శి పి.మణి, నాయకులు నవీన్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వీడి పనులు వేగవంతం

**- ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం**



చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను నిర్లక్ష్యం వీడి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సోమవారం కలెక్టర్ హరినారాయణన్ ఎంపిడిఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యు ఎస్, ట్రాన్స్‌కో తదితర ఇంజనీరింగ్ అధికారులతో గడప గడపకు మన ప్రభుత్వం పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ప్రతిష్టా త్మకంగా చేపట్టిదని ప్రతి సచివాలయం పరిధిలో అత్యంత ప్రాధాన్యత పనులు గుర్తించి చేపట్టడానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో 612 సచివాలయాలు వుంటే 349 సచివాలయాల్లో ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయ్యిందన్నారు. 336 సచివాలయాల పరిధిలో 2,173 పనులు అప్‌లోడ్ చేయగా 63.93 కోట్ల రూపాయలతో 2,073 పనులకు పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో 268 పనులు పూర్తి కాగా 1,089 పనులు పురోగతిలో వున్నాయని, మిగిలిన పనులను సత్వరం ప్రారంభిం చాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి కోర్టు కేసులు వున్న ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగజ్యోతి, జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, ట్రాన్స్‌కో ఎస్ఇ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ భరత్



కుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : కలియుగదైవం తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో తన కుమార్తె ఆరా జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ భరత్, ఆయన సతీమణి దుర్గాపద్మిని, మామ రిటైర్డ్ ఐజి ఎంకె సింగ్ కుటుంబీకులు శ్రీవారిని దర్శి ంచుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## జిల్లా వాలీబాల్ జట్టుకు పరికిదొన భవ్యశ్రీ



చౌడేపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంటులో జిల్లా జట్టుకు పరికిదొన ఉన్నతపాఠశాల విద్యార్థిని భవ్యశ్రీ ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు తుంగా నాగరాజ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న కార్వేటినగరంలో జరిగిన అండర్-14 వాలీబాల్ జిల్లాస్థాయి పోటీల్లో భవ్యశ్రీ ప్రతిభ కనబరచిందన్నారు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఈనెల 14నుంచి జరిగే రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన వివరించారు. పిడి గాయత్రి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు బాలికను అభినందించారు.

## ఓంకార జ్యోతిర్లింగేశ్వరస్వామి మహాశివరాత్రి పోస్టర్లు ఆవిష్కరణ



తిరుపతి,ఫిబ్రవరి6 ప్రభాతవార్త: తిరుపతికి సమీపం లోని వెదళ్ళచెరువులో కొలువై ఉన్న ఓంకార జ్యోతిర్లిం గేశ్వర స్వామి ఆలయంలో 18వతేదీ మహాశివరాత్రి సందర్భంగా వేడుకల కార్యక్రమాల వాల్ పోస్టర్లను రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. వెదళ్ళ చెరువు ఆలయ ంలో 18వతేదీ ఉదయం 6గంటలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పిస్తారు. 10గంటలకు 50 అడుగుల మహాశివలింగానికి పాలాభిషేకం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణయ్యస్వామి, ఆలయ సభ్యులు చంద్రశేఖరస్వామి, కొండె చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

## 11నుంచి కపిలేశ్వర బ్రహ్మోత్సవాలు



తిరుపతి,ఫిబ్రవరి 6ప్రభాతవార్త: తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11వతేదీ నుండి 20వరకు తొమ్మిదిరోజులు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల వాహనసేవల బుక్‌లెట్‌ను సోమవారం టిటిడి జెఇఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఓ దేవంద్రబాబు, ఎఇఓ పార్థసారధి, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, దర్శనం ఏర్పాట్లపై జెఇఓ వీరబ్రహ్మం అధికారులకు సూచించారు.

## శివయ్య సన్నిధిలో రాష్ట్ర మోడల్ స్కూల్ డైరెక్టర్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం విద్యాశాఖ రాష్ట్ర మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి కుటుంబసభ్యులతో విచ్చే శారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయాధి కారులతో పాటు విద్యాశాఖ ప్రోటోకాల్ అధికారి కెవి.ప్రశాంత్‌లు స్వాగతం పలికారు. ఆలయంలో మహిమాన్వితంగా నిర్వహించే రాహుకేతుపూజలు నిర్వహించుకుని స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసా దాలు అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఆలయాధికారులు ఉన్నారు.

## అతిథులకు ఆహ్వాన పత్రికలు అందించిన ధర్మకర్తలమండలి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులు సోమవారం ఇంటింటికి వెళ్ళి ఆహ్వాన పత్రికలు అందించారు. తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తికి పత్రిక అందించారు. చిత్తూరు ఎంఎల్‌ఏ జంగాల పల్లి శ్రీనివాసులు, సత్యవేడు ఎంఎల్‌ఏ ఆదిమూలం, పూతల పట్టు ఎంఎల్‌ఏ ఎంఎస్‌బాబు, ఆహ్వానించారు.కాగా అనంతపురం రేంజి డిఐజి రవిశంకర్‌ను ఆహ్వానించారు.కాగా తిరుపతి ఎస్‌పి పరమేశ్వరరెడ్డిలకు ఆహ్వాన పత్రికలను అందించి ఆహ్వానించారు. ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు సభ్యులు మున్నారాయల్, జయశ్యాం రాయల్,మల్లికార్జున్‌రెడ్డి, ఎఇఓ సతీష్‌మాలిక్, సిబ్బంది రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామి, వైకాపా నాయకులు కొండూరు నరసింహారాజు, భాస్కర్, ముదిరాజ్, బాలాగౌడ్, సునీల్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చంద్రబాబుతో సత్రవాడ భేటి!

**హైదరాబాదు బయలుదేరిన బిసి నాయకులు**

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రాజకీయాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి.గత ఎన్నికల్లో వైకాపాకు పని చేసిన వారు పార్టీకి దూరమౌతున్నారు.ఈ నేపథ్యంలో మాజీ శాసనసభ్యుడు సత్రవాడ మునిరామయ్య,ఆయన తనయుడు వైకాపా రాష్ట్ర కార్యదర్శి సత్రవాడ ప్రవీణ్‌లు పార్టీకి గుడ్‌బై చెబుతారనే ప్రచారం జరిగింది.ఈ నేపథ్యంలో నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన తల్లి బొజ్జల బృందమ్ములు పలుమార్లు సత్రవాడతో భేటి అయి చర్చలు జరిపారు.అంతేకాక పార్టీలో తమకు గుర్తింపు కరువైందనే అసంతృప్తికి గురయ్యారు.దాంతో పార్టీని వీడటానికి నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ రథసారధి నారాచంద్రబాబునాయుడు మంగళవారం ఉదయం 11 గంటలకు సత్రవాడకు పిలుపు ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం సాయంత్రం మునిరామయ్య,ప్రవీణ్‌లు తమ సహచరులు ఓ 20 మందితో భాగ్యనగరానికి ప్రత్యేక వాహనాల్లో బయలు దేరారు. చంద్రబాబునాయుడు ఏం చర్చిస్తారో ఏం భరోసా ఇస్తారో వేచి చూడాలి.



## మానసికోల్లాసం కలిగిస్తున్న క్రీడలు

తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే టిటిడి ఉద్యోగులు వార్షిక క్రీడల్లో పాల్గొని మానసికోల్లాసం ఏర్పరచుకుంటున్నారు. సోమవారం ఎంతో ఉత్సాహంగా సాగిన క్రీడల్లో 45ఏళ్ళలోపు మహిళల త్రోబాల్ పోటీల్లో ఎస్.ద్రాక్షాయణి జట్టు విజేతగా నిలవగా, స్వప్నమంజరి జట్టురన్నర్‌గా నిలిచింది. 45ఏళ్ళు పైబడిన మహిళల త్రోబాల్ పోటీల్లో ఎం.శోభారాణి జట్టు విజేతగా నిలవగా, బి.సులోచనారాణి జట్టురన్నరప్‌గా నిలిచింది. విశ్రాంత ఉద్యోగుల పురుషుల సింగిల్స్ క్యారమ్స్

## మృత్యుంజయస్వామికి ప్రత్యేకాభిషేకాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వ హించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహిం చటం ఆనవాయితి. ఈ నేపథ్యం లో సోమవారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు.ఇక్కడి మృత్యుం జయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతా లు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు.ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు.ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు,గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి ధూప,దీపనైవేద్యాలను మహా మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## తీరుమార్చుకోని పాలసముద్రం ఎంపిపి భర్త

**- ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయితీలు - అధికారులతో అధికార, అనధికార సమావేశాలు**



(ఫైల్ ఫోటో)

పాలసముద్రం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: పాలసముద్రం మండల పరిషత్ అధ్యక్షురాలి భర్త తీరు ఏ మాత్రం మార లేదు. ఎంపిపి ప్రోటో కాల్‌పై ఇప్పటికే నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎపి రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఎం.గురుప్రసాద్ జిల్లా అధికారులు, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతుంది. పాలసముద్రం ఎంపిపిగా కృష్ణజిమ్మాపురం ఎంపిటిసీగా ఎన్నిక కావడంతో ఎంపిటిసీలు ఈమెను ఎంపిపిగా ఎన్నుకొన్నారు. ఎంపిపిగా ఎన్నికైన ఈమె మండలంలో ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించకుండా కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు నివాసం మార్చివేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలకు ఆమె నామమాత్రంగా హాజరై వెళ్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఎంపిపి స్థానంలో ఆమె భర్త మండలంలో చక్రం తిప్పడం ప్రారంభించారు. ఎంపిడిఓ కార్యాలయంను అడ్డాగా చేసుకొని అక్కడే పంచాయతీలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు కావడంతో అధికారులు సైతం ప్రారంభంలో నోరు విప్పేవారు కాదు. అయితే ఎంపిడిఓ కార్యాలయంలో తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో అధికారులు ఈ వ్యవహారాలపై మింగలేక, కక్కలేక స్తబ్దుగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. బెంగళూరులో నివాసం వుంటున్న ఎంపిపి భర్త సైతం నెలలో నాలుగు సార్లు మండలానికి వస్తారు. ఇలా ఆయన వచ్చిన రోజు అధికారులు ఎంపిపి భర్తను తప్పించుకొని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడప్పుడు ఎంపిపి భర్త అధికారులతో అనధికార సమావేశాలు నిర్వహించి తాను చెప్పిన విధంగా చేయాలని ఆదేశాలు జారీ చేస్తుండటంతో వారు బిత్తరపోతున్నారు. ఒకొక్కసారి ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారికంగా నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సైతం ఎంపిపితో పాటు ఆమె భర్త కూడా హాజరై అధికారులతో సమీక్షిస్తుంటారు. రెండేళ్ళుగా ఈ పరిస్థితి సాగుతున్నా మళ్ళీ ప్రస్తుతం అధికారులు మరో గండం వచ్చి పడింది. ఇక్కడ నివాసం వుండి తమిళనాడు రాష్ట్రం నుండి తీసుకువచ్చిన వికలాంగుల సర్టిఫికేట్లను ఇక్కడ ఆప్లై చేసి వారికి పెన్షన్ మంజూరు చేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తుండటంతో ఈ వ్యవహారం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఇక్కడ పెన్షన్ మంజూరు కావాలంటే డిఆర్‌డిఎ వారు జారీ చేసిన సదరన్ సర్టిఫికేట్ తప్పనిసరి. అయితే సదరన్ సర్టిఫికేట్‌లో నిమిత్తం లేకుండా తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికేట్‌లో ఇక్కడ పెన్షన్ మంజూరు చేయాలని పట్టుబడుతుండటంతో అధికారులు తలలు పట్టుకొంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని పాలసముద్రం మండల పరిషత్ కార్యాలయ పరిస్థితిని చక్కదిద్దడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## కన్నులపండువగా దోపోత్సవం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఆలయంలో దోపు ఉత్సవాన్ని నిర్వహిం చారు. శివరాత్రి ఉత్సవా లకు సంబంధించి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అయితే ఈ వస్త్రాలను కొందరు దొంగలు దోచుకుపోవడంతో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన తొండమాన్‌చక్రవర్తి మారువేషంలో వెళ్ళి పట్టువస్త్రాలను తిరిగి తీసుకువచ్చి స్వామి అమ్మ వార్లకు అందిస్తారు. పురాతన కాలం నుంచి ఆలయంలో ప్రతి ఏడాది ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామి అమ్మవార్లతో పాటు తొండమాన్‌చక్రవర్తిని ప్రత్యేకంగా అలంకరించి సప్పరాలపై ఆశీనుల్నిచేసి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, వెంకటముని, సుదర్శనం, అర్చకులు రామకృష్ణశర్మ, ఆలయాధికారులు పాల్గొన్నారు.

# స్పందనలో ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత:ఎస్పీ



తిరుపతి క్రైం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత త్వరితగతిన పరిష్కారమని తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి నిర్వహించి ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించారు. ఎస్పి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమా చారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని స్పందన ఫిర్యాదు లాగానే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 58 మంది వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదు లన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని సుదూర ప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పి కార్యాలయానికి రాలేని వృద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా పరిగణించడం జరుగుతుందని తెలిపారు.